క్లుప్తంగా

సన్మానం



భూపాలపల్లి అర్బన్: బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్‌గా ఇటీవల ఎన్నికైన వేశాల అనిల్‌ను మండలంలోని వేశాలపల్లి గ్రామస్తులు సన్మానించారు. శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

చేయూత



రేగొండ: మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన రాస లెనిన్ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడి పదోతరగతి 2006–07 బ్యాచ్, ఎపీఆర్ఎస్ కాయంపేట విద్యార్థులతో పాటు, గురువు ఓం బ్రహ్మం లెనిన్ పరామర్శించి రూ.1,50,000 వేల ఆర్థిక సాయన్ని మృతుడి పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

పరామర్శ



టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన సియాపురం లక్ష్మీబాయి, భూపతి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి పరామర్శించారు. ఆయన వెంట బొల్లు సరోత్తంరెడ్డి, తిరుమలేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

నాగుపాము కలకలం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం నాగుపాము కలకలం సృష్టించింది. రోజులాగే కార్యాలయ అటెండర్ ఉదయం తలుపులు తెరిచి లోపలికి పోవడంతో నాగుపాము పడగ విప్పి బుసలు కొడుతూ పైపైకి రావడంతో భయాందోళనకు గురై బయటకు పరిగెత్తాడు. ఇంతలో విధి నిర్వహణలో భాగంగా పోలీస్ సిబ్బంది ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గౌడిశాల స్వామిని పిలిపించారు. ఆయన పామును ఒక సంచిలో చేరేవిధంగా చేసి దానిని చలివాగు దగ్గర వదిలారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 07 గంటల నుంచి 11 గంటల వరకు అంతరాయం కలుగుతుందని అన్నారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా అంతరాయం కలుగుతుందని తిరిగి 11 గంటల అనంతరం విద్యుత్ పునరుద్ధరణ చేపడతామని అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



పరకాల : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించకపోవడంపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మంగళవారం నిరసన తెలియజేశారు. ఈమేరకు పరకాల పట్టణంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ మాట్లాడారు. బీఆర్ఎస్‌లో ఓటమి ఖాయమన్న భయంతో కాంగ్రెస్‌లో చేరిన కడియం కావ్యకు కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి స్థానాన్ని కేటాయించడం హేయమన్నారు. పార్టీని నమ్ముకున్న మాదిగలకు అన్యాయం చేసి పదవుల కోసం పార్టీలో చేరిన వారికి ఎంపీ టికెట్ కేటాయించడం అన్యాయమన్నారు. మాదిగలను చిన్న చూపు చూస్తున్న రేవంత్‌రెడ్డి వైఖరి మార్చుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ పరకాల నియోజకవర్గ మంద రాజు మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాతల రమేష్, నాయకులు గోవిందు రవీందర్ మాదిగ, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలనకు స్వస్తి!

ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం
- ఎప్పుడొస్తారో ఎప్పుడెళ్తారో ఎవరికీ తెలియదు..
- పేరెంట్స్ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- విద్యకు దూరమవుతున్న చిన్నారులు



ఎంఈఓ భవనం

కన్నాయిగూడెం: మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. ఉపాధ్యాయులు పాఠశాలకు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. ఉపాధ్యాయులు పలు ప్రాంతాల నుంచి బస్సు మార్గాన వస్తోంటారు. కొన్ని గ్రామాలకు బస్సులు సమయానికి రాకపోవడంతో వారు కూడా రాని పరిస్థితి. వారిని అడిగే వారే లేరని పలువురు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో పాఠశాలలో ఉపధ్యాయులే ఉండరనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై ఇటీవల మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కాంప్లెక్స్ హెచ్ఎం స్వరూపకు మండల కేంద్రంలో ఫిర్యాదు చేశారు. అలాగే డీఈఓకు కూడా ఫిర్యాదు చేశారు. ఏదిఏమైన ఉపాధ్యాయుల అలసత్వంతో విద్యార్థులకు అందవలసిన విద్య దూరమవుతుందనే విమర్శలు వస్తున్నాయి. మండలంలో వివిధ పాఠశాలల్లో 1233 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అధికారుల లెక్కల ప్రకారం 72 మంది ఉపాధ్యాయులు ఉండాలి, కానీ 45 మంది మాత్రమే ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలు అరకొర టీచర్లతో నడుస్తున్నాయి. ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్ మండలానికి వచ్చి పర్యటించిన దాఖలాలు లేవు. ఇక్కడా ఎంఈఓగా ఉండి హనుమకొండలోని ఓ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మండలంలో విధులు నిర్వహిస్తున్న వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇస్తే కొంత మెరుగు పడుతుందని ప్రజలు కోరుతున్నారు.

హనుమకొండకు బదిలీ అయ్యాను..

బదిలీ రీత్యా హనుమకొండకు వెళ్లాను. మండలానికి నాకు గ్యాప్ వచ్చిన మాట నిజమే. సీఆర్పీలతో మానిటరింగ్ చేస్తున్నా. ఇక్కడి నుంచి అక్కడికి రావడానికి 150 కి.మీ ఉంటుంది. దానితో పాటు బాధ్యతలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అక్కడ అందుబాటులో ఉన్నవారికి బాధ్యతలు ఇస్తే బాగుంటుంది. ఉపాధ్యాయులకు సంబంధించిన సెలవులు, జీతాలు, మానిటరింగ్ అంత కాంప్లెక్స్ హెచ్ఎం చూసుకుంటున్నారు

– రాజేష్, ఇన్‌చార్జ్ ఎంఈఓ

సమయానికి రావడం లేదు



మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో కొంత మంది సమయానికి పాఠశాలలకు రావడం లేదు. వచ్చిన పూర్తి టైం ఉండకుండా కొంత సమయం ముందుగానే బస్సు ఎక్కి వెళ్తున్నారు. మండలంలోని లక్ష్మీపురంలోని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రాకపోవడంతో గ్రామంలోని కొంత మందిమి కలిసి కాంప్లెక్స్ హెచ్ఎంకు ఫిర్యాదు కూడా చేసినం ఇప్పటికైన ఉపాధ్యాయులు వచ్చే విధంగా చూడాలని కోరుతున్నాం

– సాయి, యువకుడు, లక్ష్మీపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ జగన్నాథరావు

మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లో మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగపేట సీఈఓ జగన్నాథరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతగా మండలంలోని వాడగూడెం, కత్తిగూడెం, వాగొడ్డుగూడెం, తిమ్మంపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఎన్నడు లేని విధంగా కోతలు ప్రారంభం కాకముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆక మహేష్, రైతులు తోట రమేష్, రామగిరి సురేందర్, వెంకటేశ్వర్‌రావు, మడి వేణుగోపాల్, అచ్చి రెడ్డి, రామారావు, సెంటర్ ఇన్‌చార్జ్ మడి శోభన్, ఎఫ్ఎస్‌సీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణరావును కలిసిన ఎమ్మెల్యేలు



సత్యనారాయణరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యేలు

భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును భూపాలపల్లిలో సోమవారం రాత్రి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల విషయమై చర్చించినట్లు సమాచారం.

ఎన్నికల విధులకు మినహాయింపు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

టేకుమట్ల: లోక్‌సభ ఎన్నికల విధులకు దీర్ఘకాలిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరె రాకేష్‌రెడ్డి, వెలిశోజు బుచ్చిరాములు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఉపాధ్యాయ సంఘ నాయకులు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఏడీ రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీపీ, షుగర్, కేన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, డయాలసిస్ పేషెంట్లతో పాటు, గర్భిణులు, రెండు సంవత్సరాలలో ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయించాలన్నారు. ఎన్నికల సమయంలో వైద్యాధికారులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కోరారు. ఎన్నికల అనంతరం నివేదిక ఫారాలను అందజేస్తున్న సమయంలో ఎక్కువ కౌంటర్లను చేసి సకాలంలో ఉద్యోగులు ఇంటికి చేరే వెసులుబాటు కల్పించాలని కోరారు. వారి వెంట రాష్ట్ర బాధ్యులు కొన్నేటి దయాకర్, వేణు, సతీష్, జిల్లా బాధ్యులు దాగంటి ఆనంద్, మధుసూదన్‌రెడ్డి, టేకుమట్ల మండల బాధ్యులు తిరుపతి, రవి, లింగమూర్తి ఉన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం సెంటర్‌లో మంగళవారం పోలీసులు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. వెంకటాపురం మండల కేంద్రానికి వాజేడు, చర్ల మండలాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానిత వ్యక్తుల వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలి



పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

చిట్యాల: సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల, బడుగు బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు చేసిన గొప్ప వీరుడని అన్నారు. అనంతరం పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గణపతి, గుర్రపు తిరుపతి గౌడ్, గోపగాని కొమురయ్య, రఘు, శ్రీనివాస్, మల్లయ్య, గాజర్ల సమ్మయ్య, కట్టగాని రాంచందర్, ఊయ్యాల రమేష్, బుర్ర మురళి, రవీందర్, గుర్రపు రాయకొమురు తదితరులు పాల్గొన్నారు.

జామ మసీద్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జామ మసీదులో మంచిర్యాల జిల్లా చెన్నూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జులిఫికర్ ముస్లింలకు రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందును మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిసార్, శఫీక్, అమీన్, సమద్, శకీల్, రయాన్‌ఖాన్, ఇషాక్, రాజీమహ్మద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో సౌకర్యాలు కల్పించాలి




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : ఉపాధిహామీ పథకం కూలీలు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పని ప్రదేశాలలో తగిన సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి రాజేందర్, సీఐ క్రాంతికుమార్, వైద్యాధికారి స్పందన ఉన్నారు.

'చర్య తీసుకోవాలి'

నర్సంపేట: విద్యార్థిని చితకబాదిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. ఏబీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఖానాపురం మండలం బుధరావుపేటలోని బ్రిలియంట్ హైస్కూల్లో శనివారం విద్యార్థిని చితకబాదిన సంఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దు, రవితేజ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న అశోక్

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామంలో నిర్మిస్తున్న రామాలయానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం సర్పంచ్ ఎండీ అహ్మద్‌పాషా ఆధ్వర్యంలో రూ.25 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి శ్రీనివాస్, పురుషోత్తం, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం: గీతకార్మికుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మతల్లి దీవెనలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని దర్మరావుపేట గ్రామంలో గీతకార్మికుల ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయనకు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో పాడి పంటలతో గ్రామం వీరాజిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కర్రవానిగూంపు గ్రామంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. గ్రామంలోని అపరిచిత వ్యక్తులు ఎవరైనా వస్తే వారి సమాచారాన్ని పోలీసులుకు అందించాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. గ్రామంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. బడి ఈడు కలిగిన పిల్లాలను బడికి పంపించాలని సూచించారు. గ్రామస్తులు ఎవరు అడవి జంతువులవేటకోసం ఉచ్చులు, కరెంట్ తీగలు పెట్టి ప్రమాదాలకు కారణం కావద్దని అలా ఎవరైన చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సైబర్ నేరస్తుల వలలో పడి మోసపోకుండా ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న వీరన్న

భూపాలపల్లి రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌ను గెలిపించాలని ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేల్పు వీరన్న కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వీరన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో సుదీర్ఘంగా పోరాటాలు జరుగుతున్నాయన్నారు. వర్గీకరణకు బీజేపీ అనుకూలంగా ప్రకటన చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అంబాల చంద్రమౌళి, దోర్నాల రాజేందర్, అంతడుపుల సురేష్, సోముల శ్రీనివాస్ వివిధమండలాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



ఇసుకను సీజ్ చేస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని గ్రామ శివారులో కంకల వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కంకల వాగు సమీపంలో అక్రమంగా ఇసుక నిల్వ ఉంచారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సూమారు 120 ట్రిప్పుల ఇసుకను నిల్వ ఉంచారని దాని విలువ లక్ష ఇరువై వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, ఆర్ఐ మల్లయ్య, సర్వేయర్ వీరస్వామి ఉన్నారు.

పది లీటర్ల గుడుంబా స్వాధీనం



స్వాధీనం చేసుకుంటున్న గుడుంబా, ద్విచక్రవాహనం

ఏటూరునాగారం: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మంగపేట మండలం కమలాపురం గ్రామంలోతనిఖీలు చేస్తుండగా పది లీటర్ల గుడుంబా (నాటు సారను) పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం గ్రామానికి చెందిన భూక్య లక్ష్మణ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై గుడుంబాతో పట్టుబడ్డారు. అతడిపై కేసు నమోదు చేసుకొని గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా గుడుంబా తయారీ చేసినా, విక్రయించినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ సందీప్, కానిస్టేబుల్ నవీన్, తిరుపతి, నాగరాజు, శ్రీనివాస్, వీరన్న, ప్రణయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.